క్లుప్తంగా

గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరించండి

● సబ్ కలెక్టర్ త్రివినాగ్



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: సమస్యలపై గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చే అర్జీలను అధికారులు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన 32 మంది అర్జీలు అందజేశారు. అర్జీలను సబ్ కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. గ్రీవెన్స్‌లో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ



విద్యార్థులను తనిఖీ చేసి లోపలకు పంపిస్తున్న సిబ్బంది

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించగా మొత్తం 219 మంది విద్యార్థులకుగాను ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఆర్‌ఐఓ సైమన్ విక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయని చెప్పారు.

పారిశుధ్య పనులపై ప్రజాభిప్రాయ సేకరణ



పనులను పరిశీలిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

పొదిలి: నగర పంచాయతీ పరిధిలో చేస్తున్న పారిశుధ్య పనులపై స్వచ్ఛ సర్వేక్షణ్ టీం సభ్యులు ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారు. మూడు రోజులపాటు పట్టణంలో పర్యటిస్తున్న సభ్యులు పరిశుభ్రత, మురుగు కాల్వల నిర్వహణ తదితర అంశాలపై సర్వే చేస్తారు. మురుగు కాల్వల నిర్వహణ, ఇతర పారిశుధ్య పనులపై సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని, ఫిర్యాదులు చేయవచ్చని టీం సభ్యులు తెలిపారు.

అభయారణ్యంలో అగ్ని ప్రమాదం



అడవిలో ఎగసిపడుతున్న మంటలు

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట సమీపంలో గుండ్లకమ్మ రేంజ్ పరిధిలోని నల్లమల అభయారణ్యంలో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. గిద్దలూరు నుంచి నంద్యాల వెళ్లే వాహనదారుల్లో గుర్తుతెలియని వ్యక్తులు అగ్గిపుల్ల వేయడం వల్ల మంటలు వ్యాపించినట్లు అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. మంటలు చెలరేగిన వెంటనే అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో వన్యప్రాణులకు పెను ప్రమాదం తప్పింది.

తలరాత మార్చే చేతిరాత



తిరుపాలయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం: చక్కటి చేతిరాతతో తలరాత మార్చుకోవచ్చని గ్రాఫాలజిస్టు సీహెచ్ తిరుపాలయ్య పేర్కొన్నారు. మార్కాపురం మండలంలోని వేములకోట జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు గత 21 రోజులుగా తెలుగు, ఇంగ్లిష్ చేతిరాతపై గ్రాఫోథెరపీ, గ్రాఫాలజీ సైన్స్ ఆధారంగా శిక్షణ ఇచ్చారు. సోమవారం శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చక్కని చేతిరాతతో మంచి మార్కులు సాధించవచ్చని చెప్పారు. అనంతరం హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రాఘవ, విప్లవకుమార్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

అగ్ని సంకటం

● క్షణాల్లో బూడిదవుతున్న కర్షకుల కష్టం
● తరచూ సంభవిస్తున్న అగ్నిప్రమాదాలు
● వేసవిలో ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం
● పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై సాగదీత ధోరణి



కాకర్లపల్లిలో బ్యారన్‌లో మంటలార్పుతున్న సిబ్బంది(ఫైల్)



కాకర్లపల్లిలో అగ్ని ప్రమాదానికి గురైన బ్యారన్(ఫైల్)



గొట్లగట్టులో తగలబడుతున్న గడ్డి వామి(ఫైల్)

కొనకనమిట్ల:

పొగాకు క్యూరింగ్ దశలో ప్రమాదవశాత్తు సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలు.. రైతుల ఆరుగాలం కష్టాన్ని బూడిద చేస్తున్నాయి. లక్షల విలువైన పొగాకు, సామగ్రి అగ్ని కీలలకు ఆహుతి అవుతున్నాయి. విపత్కర సమయంలో మంటలను అదుపు చేయడానికి అందుబాటులో అగ్నిమాపక వాహనం కూడా లేకపోవడంతో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల్లో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

పొదిలి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని 13 మండలాల్లో 2,400 వరకు బ్యారన్లు ఉన్నాయి. దాదాపు 4,600 మంది రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. అందులో కొనకనమిట్ల, పొదిలి, మర్రిపూడి మండలాల్లో సుమారు 1200 వరకు బ్యారన్లు ఉన్నాయి. కాగా పొదిలి ప్రాంతంలో ఏటా ప్రమాదవశాత్తు 10 బ్యారన్లు అగ్ని రవ్వలకు బుగ్గవుతున్నాయి. ఫలితంగా రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ప్రమాదం సంభవించినప్పుడు రైతులకు బీమా కంపెనీలు చెల్లించే నష్ట పరిహారం స్వల్పంగా ఉండటంతో ఆర్థికంగా చితికిపోవాల్సి వస్తోంది.

ఫైరింజన్‌కు ‘బ్రేకులు’!

కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల్లోని గ్రామాలకు సమదూరంలో ఉన్న పొదిలి పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఎండమావిగానే మిగిలింది. ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడం వల్ల మూడు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినా ఇంత వరకు అతీగతీ లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అగ్ని ప్రమాదం సంభవిస్తే కనిగిరి లేదా మార్కాపురం నుంచి ఫైరింజన్ వచ్చే సరికి ఇక్కడ బూడిద మిగులుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడచిన కొన్నేళ్లలో పలు గ్రామాల్లో పొగాకు బ్యారన్లతోపాటు గడ్డి వాములు, పూరిళ్లు అగ్ని ప్రమాదానికి గురై ఒక్కో బాధితుడికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ఇటీవల కొనకనమిట్ల మండలంలో 5 బ్యారన్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఈ మండలం భౌగోళికంగా విస్తారంగా ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు గ్రామాల్లోని ప్రజలు ఒకరికొకరు సహకరించుకోవాల్సిందే తప్ప ఫైరింజన్ కోసం ఎదురుచూసే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారిని వివరణ కోరగా.. ‘టెండర్ దశ పూర్తయిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం’ అని చెప్పారు.



నాగంపల్లిలో పూర్తిగా కాలిపోయిన బ్యారన్(ఫైల్)

అగ్నిమాపక కేంద్రం లేక ఇబ్బందులు



పొదిలి ఏరియాలో అగ్నిమాపక కేంద్రం లేకపోవటం విచారకరం. పొగాకు బ్యారన్లు అగ్ని ప్రమాదానికి గురైనప్పుడు ఫైరింజన్ వచ్చే సమయానికి ఏమీ మిగలడం లేదు. దూరంగా ఉన్న కనిగిరి, మార్కాపురం పట్టణాల నుంచి అగ్నిమాపక వాహనాలు రావడం ఆలస్యం అవుతోంది.

– పొదిలి తిరుపతయ్య, రైతు, గొట్లగట్టు

పగలే వెన్నెల.. ఇంత నిర్లక్ష్యమేల?



ఖాజీపురంలో పగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు



గొట్టమిండ్ల సమీపంలో మెయిన్‌రోడ్డుపై వెలుగుతున్న వీధి లైట్లు

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే విద్యుత్ వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధి దీపాల నిర్వహణను విద్యుత్, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ దీపాలకు ప్రత్యేకంగా మూడో లైన్ లేకపోవడం, నూతన లైన్ ఏర్పాటు చేసిన గ్రామాల్లో ఫ్యూజ్ క్యారియర్లు, స్విచ్‌లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. దీంతో పంచాయతీలపై విద్యుత్ బిల్లు రూపంలో అదనపు భారం పడుతోంది.

కమనీయం.. గోవిందుడి కళ్యాణం



అమ్మవారి తాళిబొట్లు చూపుతున్న అర్చకులు

మార్కాపురంటౌన్: స్థానిక జవహర్‌నగర్ కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత అమలక లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో 62వ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కళ్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాధికతోపాటు పలువురు ప్రముఖులు హాజరై కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు డీవీ కృష్ణారెడ్డి, జి.వెంకటరెడ్డి, వై.సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, యోగిరెడ్డి, మహిళా కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న జంకె దంపతులు, తదితరులు

పాతాళనాగేశ్వరస్వామి ఆలయంలో అన్నా పూజలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాతాళనాగేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు సతీసమేతంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఆర్డీ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కాతా నరసింహారెడ్డి, ఓబులరావు, సీఆర్‌పి మురళి, పోలేపల్లె శివ తదితరులు ఉన్నారు.



పూజలో పాల్గొన్న అన్నా రాంబాబు దంపతులు

5న మున్సిపల్ కార్మికుల ధర్నా

మార్కాపురం టౌన్: ఆప్కాస్ రద్దును నిరసిస్తూ ఈనెల 5వ తేదీన మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఏజెన్సీలకు మున్సిపల్ కార్మికులను అప్పజెప్పే విధానాలను మానుకోవాలని, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలంలో ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని కోరారు. కార్మికుల వేతనం పెంచాలని, మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, సలాంఖాన్, ఇమాంసా, యూసఫ్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

వన్యప్రాణులకు హాని తలపెట్టకూడదు

● ఎఫ్ఆర్‌ఓ, డీఆర్‌ఓ సూచన

మార్కాపురం: వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్కాపురం అటవీశాఖ ఎఫ్ఆర్‌ఓ వరప్రసాద్‌రావు, డీఆర్‌ఓ నాగరాజు పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, వివేకానంద విద్యాపీఠంలో 162 మంది విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అడవి జంతువులకు హాని తలపెట్టకూడదని సూచించారు. పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందిస్తామని తెలిపారు. ఎఫ్‌బీఓలు రవికుమార్, బాలాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాల్య వివాహాల నిరోధానికి సంతకాల ఉద్యమం

● మొదటి సంతకం చేసిన సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధానికి సంతకాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా మొదటి సంతకాన్ని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలను పూర్తిగా కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై గ్రామాల్లో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. ఆడబిడ్డ పేరుమీద మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుశీలాదేవి, సూపర్‌వైజర్లు బుజ్జి, రవికుమారి, రమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కంభం: బాలికల సంరక్షణ, విద్యకు అత్యధిక ప్రాముఖ్యతనివ్వాలని సీడీపీఓ నీలోఫర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక గురుకుల పాఠశాలలో బాల్యవివాహాల నిర్మూలన, బాలికా విద్య, బాలికల సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించి సంతకాల సేకరణ, ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు చెంచులక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాల్య వివాహాల నిరోధం కోసం సంతకం చేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పొదిలి రూరల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీడీపీఓ పి.సుధామారుతి పేర్కొన్నారు. సోమవారం పొదిలి మండలంలోని మూగచింతల ఎంపీయూపీ స్కూల్లో బాల్య వివాహ చట్టం నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నా ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తూనే ఉన్నాయన్నారు. దీనికి కారణం పేదరికం, సరైన అవగాహన లేకపోవడమేనని చెప్పారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మస్తాన్‌వలి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధవీడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అర్ధవీడులోని 140 నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమీజాబి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు.



కంభం: విద్యార్థినులతో ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ, ప్రిన్సిపాల్

మహిళలు చైతన్యవంతులు కావాలి

కొమరోలు: మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని ఏఎస్సై పవన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాజుపాలెం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, ఎస్‌బీఎన్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఏఎస్సై పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేసుకోవద్దని, మంచిగా చదువుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు.



మూగచింతలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



అర్ధవీడులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



కొమరోలు : మాట్లాడుతున్న ఏఎస్సై పవన్‌కుమార్

శివభక్తులకు అల్పాహారం పంపిణీ

మార్కాపురం టౌన్: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రథోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్డి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. దాతల సహకారంతో భక్తుల కోసం అల్పాహారాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓ చెన్నకేశవరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు టి.రామిరెడ్డి, కె.రమణారెడ్డి, కేవీ నరసింహారెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, జి.చిన్నవెంకటరెడ్డి, ఆర్‌వీ సుబ్బారెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అల్పాహారం అందజేస్తున్న రెడ్డీ సంక్షేమ సంఘ నాయకులు

ప్రకృతి రమణీయం





సూరీడు పొద్దు పొడుస్తున్న వేళ నిప్పులు చిమ్ముతున్నట్లుగా ఆవిష్కృతమైన దృశ్యం.. పగలంతా సెగలు కక్కి సంధ్య వేళకు అలసి వాలిపోతున్న దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను అబ్బురపరిచాయి. ఈ చిత్రాలను గొట్లగట్టు సమీపంలో ‘సాక్షి’ క్లిక్ మనిపించింది.

– కొనకనమిట్ల